కథ

# మౌనం శరణం గచ్ఛామి

బుద్ధుడంటే నాకు చాలా ఇష్టం.

మానవ జీవితంలోని బాధామయ అధ్యాయాల గురించీ, కోర్కెల గురించీ, ప్రలోభాలు, ఆఖరికి శాంతి, క్షమ గూర్చి బుద్ధుడు చెప్పినంతగా ఎవ్వరూ చెప్పలేదనుకుంటాను.

ముఖ్యంగా 'క్షమించటం' గురించి-

ఆ లక్షణమే నన్ను కాపాడింది. ఆధ్యాత్మికంగా నేనేం సాధించానో తెలీదుకానీ, భౌతికంగా ఎదిగేందుకు ఆ లక్షణమే నా ఆయుధమయ్యింది.

'క్షమ' పిరికివాళ్ళ పఠనమంత్రం అనుకునే నేను అది ఓ దివ్యాయుధం అని తెల్సుకునే దాకా నా జీవితంలోని ప్రతి అవమానం, పరాజయం, దుఃఖాల నుంచీ రక్షించి నాకు అంతిమ విజయాన్ని అందించింది నా 'క్షమా హృదయమే'!

★ ★ ★

జీవితంలో ఓ లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగేవారికి ఎక్కువమంది శత్రువులుగా మారుతారనుకుంటాను. చాలా మందికి నేను బద్ధశత్రువుగా మారడానికి కారణం ఇతరుల కంటే విభిన్నంగా ప్రవర్తించటం, ఆలోచించడమే అని నాకు ఆలస్యంగా అర్థమైంది.

ఆత్మవంచన లేకుండా ఆత్మవిమర్శ చేసుకున్నాను.

ముక్కుసూటిగా నడవడం, మనసులో వుండే ఫీలింగ్స్‌ను నిస్సంకోచంగా వెల్లడించడం, అక్కడలేని మూడో వ్యక్తి గురించి నీచంగా మాట్లాడలేకపోవడం, ఎవరైనా మాట్లాడినా ఎంజాయ్ చేయలేకపోవటం లాంటి లక్షణాలు నాకు మైనస్సయ్యాయి. సమాజం అనేది విభిన్న వ్యక్తుల సమూహం అయినప్పుడు వాళ్ళతో కలిసి సహజీవనం చేయాలంటే పై లక్షణాలను అలవర్చుకోవాలని అర్థమైనా ఎందుకో నాకు ఇష్టం లేకపోయింది. అందుకే నాదైన ప్రపంచంలో నేనుండిపోయాను.

అసలు నాకు యవ్వనం నుంచే పెద్దగా స్నేహితులుండేవారు కాదు.

నేను లైబ్రరీలో కూర్చుని చదువుకుంటుంటే, నా వయస్సు సహచరులు సిగరెట్లు త్రాగుతూ, బైక్స్ మీద అమ్మాయిలను కామెంట్స్ చేస్తూ తిరుగుతుండేవారు. అలా అని చెప్పి వాళ్ళమీద నాకెప్పుడూ చిన్న చూపులేదు. ఎవరికి ఏపని ఆనందం ఇస్తే వారా పని చేస్తుంటారు. అందులో తప్పొప్పుల గురించి వెదికేంత పరిపూర్ణత నాకు లేదని తెలుసు.

పైగా ఏకాంతం నాకు ఎంతో శక్తినిచ్చేది.

వంటరిగా మనలోకి మనం చూసుకుంటూ ఆత్మవిమర్శ చేసుకుంటుంటే వచ్చే జ్ఞానం, సంతృప్తీ, ఆత్మవిశ్వాసం నాకు అనుభవంలోకి వచ్చే కొలదీ నేను మరింత అంతర్ముఖుడనయ్యాను.

ఆ బేసిక్ లక్షణమే నన్ను రచయితను చేసింది.

ఎనిమిదో తరగతి చదువుతున్న సమయంలో నా కథ చందమామలో వచ్చింది. అసలు సాహిత్యం వైపు నేను ఎందుకు ఆకర్షితుడను అయ్యానో ఈ రోజుకీ నేను చెప్పలేను. చిన్నతనంలో అమ్మ నోట్లో అన్నం ముద్దలు పెడుతూ చందమామ, బాలమిత్ర కథలు చెప్పేది. అమ్మ చెప్పే ఆ కథలతో తినే అన్నం అమృతం కంటే అద్భుతంగా వుండేది. హైస్కూల్లో చేరిన తర్వాత క్లాసులోని పిల్లలందరూ నా చుట్టూ చేరేవాళ్ళు. నేను చందమామ, బొమ్మరిల్లు కథలు వాళ్ళకు చెప్పేవాడిని. నేనంటే స్కూల్లో చిన్నతనం నుంచే అదోలాంటి క్రేజ్ వుండేది.

ఓ రోజు స్కూల్లో అదే విధంగా నేను చుట్టూ చేరిన పిల్లలకు కథ చెబుతుండగా జాకీగాడు గయ్యిమంటూ లేచాడు. ''నువ్వు చెప్పేది చందమామలో కథేగా? అది అట్లాలేదు..మావయ్య నాకు చెప్పాడు'' అంటూ నామీద విరుచుకుపడ్డాడు.

అదీ నిజమే...

చందమామ కథలో రాక్షసుడు రాజకుమారిని ఎత్తుకుపోవటం దగ్గరనుంచీ మిగిలిన కథంతా స్వయంగా నేను అల్లిందే. అది జాకీగాడికి నచ్చలేదు. కానీ విచిత్రంగా మిగిలిన పిల్లలంతా నన్నే సపోర్ట్ చేసారు. ఆవిధంగా ఒక విషయాన్ని నాకు నచ్చిన విధంగా చెప్పటం అనేది నాకు బాల్యం నుంచీ అలవడింది. ఆ లక్షణమే నన్ను రచయితను చేసింది.

★ ★ ★

''నా కూతురు ఏం చేసిందో చూశావా?''

నేను మౌనంగా ఉండిపోయాను. నా రియాక్షన్‌కు ఆయన ఆశాభంగం చెందినట్లు కన్పించాడు. ''అయ్యో పాపం!'' అనే సానుభూతి నానుంచి ఆశించాడో లేక నా కళ్ళల్లో శాడిజం కన్పిస్తుందేమో చూడాలనుకున్నాడో నాకు తెలీదు.

నా విషయం వదిలేస్తే ఆయనకు సంబంధించీ నేను ఆయన బద్ధశత్రువుని.

కేవలం ఇద్దరం రచయితలం కావటం మాత్రం అందుకు కారణం కాదు. ఆ మాటకు వస్తే వయస్సులో కానీ, రచయితగాకానీ, పాపులారిటీలోకానీ ఆయన నాకంటే చాలా సీనియర్..

కానీ అది గతం ఎటలీస్ట్ పాపులారిటీ విషయంలో..

పాపులారిటీ, సక్సెస్ ఎల్లకాలం ఒక వ్యక్తి దగ్గరే ఎప్పుడూ స్తంభించి పోవు. అవి నిరంతరం చలిస్తూనే వుంటాయి. తన కంటే చాలా జూనియర్‌నయిన నేను 'సక్సెల్‌ఫుల్' కావటం ఆయన జీర్ణించుకోలేకపోతున్నాడని నాకు తెలుసు. కానీ ఏదో రోజు నా పరిస్థితీ అంతే.

సక్సెస్ మన నుంచి దూరంగా జరిగిపోయినా కూడా 'సక్సెస్‌ఫుల్ హ్యూమన్ బీయింగ్'గా మిగిలిపోవటమే జీవితంలో సాధించే పరిపూర్ణమైన సక్సెస్ అని నేను ప్రగాఢంగా నమ్ముతాను.

''ఏమీ మాట్లాడరేంటి..? నా కూతుర్ని ఎంత గారాబంగా పెంచానో మీకు తెలీదు. నా పెళ్ళయిన పదేళ్ళకు పుట్టిందది. పద్దెనిమిదేళ్ళకే అది ఓ ప్లాట్‌ఫారంగాడితో లేచిపోతుందని నేను వూహించలేదు..''

నిజమే..

ఏ తండ్రీ వూహించలేడు. కూతురు లేచిపోవడం బాధ కల్గించిందో లేక ప్లాట్ ఫారంగాడితో లేచిపోవడం బాధనిచ్చిందో నాకు అర్థం కాలేదు. బహుశా రెండోది కారణం అనుకుంటాను. అయినా ఈ విషయంలో మన బాధ్యత ఎంత అనేది కూడా ఆలోచించాల్సిన విషయమే కదా!

ఆయన్ని చూసి, డబ్బు, పేరు ప్రఖ్యాతులు, ఆత్మసంతృప్తి ఈ మూడే ఏ రచయితనైనా ఇన్‌స్పైర్ చేస్తాయనుకునేవాడిని కానీ కాలం గడుస్తున్న కొద్దీ మరిన్ని దారుణమైన విషయాలు తెల్సి వచ్చాయి.

''శాడిజం..పర్వెర్షన్''

ఈ రెండు నికృష్ట లక్షణాలు ఓ మనిషిలో వుంటే ఎంత ప్రమాదం. అటువంటిది అవి రచయితల్లో వుంటే? ఏం జరుగుతుందనేదానికి ఉదాహరణ నేటి సాహిత్యమే.

పెళ్ళికాక ముందే టీనేజ్‌లో ఎఫైర్స్. పెళ్ళయిన తరువాత అక్రమ సంబంధాలు, మానవ సంబంధాలను వక్రభాష్యాలతో విశ్లేషించటం, సెన్సేషన్ కోసం అడ్డమైన చెత్త వ్రాయటం..ఇదీ నేటి సమాజ దుస్థితి.

రచయితగా కలం పట్టిన కొత్తల్లో ఈ విషయంపై నేను కాంతికుమార్‌గారితో వాదనకు దిగాను.

''మీరు చాలా పాపులర్ రచయిత అయివుండి ఎందుకిలా వ్రాస్తున్నారు?'' అని అడిగాను.

అజ్ఞానిని అరిస్టాటిల్ చూసినట్లు చూసాడాయన.

''ఇలా వ్రాయటం వల్లనే నేను ఇంత పాపులర్ అయ్యాను..''

ఆ సమాధానానికి నేను తట్టుకోలేకపోయాను. రచయితకు సమాజం పట్ల బాధ్యత వుంది. వుండాలి. అది లేకపోగా లేత వయసులో వికృత భావాలు, స్పందనలను కలిగించే హక్కు ఎక్కడుంది? సమాజాన్ని బాగు చేయలేకపోతే సరే..పాడు చేయటం తప్పుకదా! అదే ఆయన్ని అడిగాను.

''నువ్వు అడుగుతున్నది నాకు అర్థం కావటం లేదు..''

''ఇందులో అంత అర్థంకాని విషయం ఏముంది సార్?'' నేను ఆవేశంగా అన్నాను.

''రచయిత అనేవాడు సమాజంలోని వ్యక్తులు, పరిస్థితులు, సమస్యలను విశ్లేషించి, వాటికి పాజిటివ్ కోణంలోంచి పరిష్కారం సూచించాలి. క్షీణించిపోతున్న మానవ సంబంధాలు, విలువలు, పవిత్రత, అనుభూతుల గురించి పాఠకులు


తాము ఏం కోల్పోతున్నారో అర్థం అయ్యే విధంగా వ్రాయాలి. మంచితనం, సున్నితత్వం, భావుకత, నైతిక విలువలు వీట న్నింటినీ జీవితంలో ఆలంబనగా చేసుకుని జీవిస్తే వచ్చే సంతృప్తి గురించి వ్రాయాలి. ఇంకా..'' నేను ఏదో కొనసాగి స్తుండగా ఆయన మధ్యలో అడ్డుపడ్డాడు.

''బాగా చదువుకున్న నువ్వు ఎందుకింత స్టుపిడి టీతో ఆలోచిస్తావు?''

''ఇదంతా స్టుపిడిటీనా?''

''నిస్సం దేహంగా..''

ఆయన నవ్వాడు.



''నువ్వు రచయితవు ఎందుకు అయ్యావో నాకు తెలీదు. నా మటుకు నేను డబ్బు, పేరు ప్రఖ్యాతుల కోసం రచయితనయ్యాను. నాకు స్పోర్ట్స్‌లో ప్రవేశం లేదు. రాజకీయాల్లో చేరేంత బాక్‌గ్రౌండ్, డబ్బూ లేదు. సినిమా నటుడు కాదగ్గ అందంకానీ టాలెంట్‌కానీ లేదు. అందుకే చివరగా రచయితను అయ్యాను. బాగా వ్రాయగల ఇద్దరు ఘోస్ట్ రచయితలను పట్టుకుని వాళ్ళకు కొంత పడేసి దాన్ని పత్రికలకు, పబ్లిషర్స్‌కు తెలివిగా అమ్ముకో వడం వల్లనే నేను సక్సెస్ అయ్యాను. నా మేధస్సుతో టాలెం టెడ్ ఘోస్ట్‌లను పట్టుకుని సెన్సేషనల్ పబ్లిసిటీతో నా సాహిత్యం అమ్ముకుంటున్నాను. ఈరోజు నేను ప్రముఖ రచయితని. నేను రాసిందాన్ని లక్షలాది పాఠకులు ఆసక్తిగా చదువుతారు..''

నేను స్థాణువునై వింటుండసాగాను.

''కొత్తగా రాస్తున్న సమయంలో సమాజాన్ని మొత్తం ఉద్ధ రించాలన్న ఆవేశం ఉంటుంది. కాని కాలం గడుస్తున్న కొద్దీ మనం రాసేది మనమే పట్టించుకోని స్థితికి వస్తాం. ఇక పాఠ కులేం పట్టించుకుం టారు? జనం ఉత్తమ సాహిత్యం గురించి మాట్లాడతారు. కానీ రాస్తే చదవరు. తపన వున్నవాడివీ, బాగా రాయగలవాడివి కాబట్టి చెబుతున్నాను. సెక్స్ దట్టించి వ్రాయటం మొదలు పెట్టు..పేరు వస్తుంది డబ్బుకూ లోటుండదు. పనికి రాని సిద్ధాంతాలను పట్టుకుని ప్రాకులాడకు''

కాంతికుమార్ మీద సీనియర్ రచయితగా నాకు ఎంతో గౌరవం వుంది. ఆయన ఘోస్టులను పెట్టుకుని 'సాహితీ వ్యాపారం' చేస్తున్నాడన్నది విని వున్నా నేను ఏనాడూ పట్టించు కోలేదు. అటువంటిది ఈరోజు ఆయనే డైరక్టుగా చెప్పేసరికి తట్టుకోలేకపోయాను.

''ఇంతగా దిగజారిపోయి రచయితగా రచనలు చేయటం ఎందుకు సార్?''

''డబ్బుకోసం..''

''రచయితగా మనకేమీ బాధ్యత లేదా?''

''లేకేం...ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం నుంచి ప్రింట్ మీడియాను రక్షించాల్సిన బాధ్యత మనదే కదా! మరి ఆ బాధ్యతను నిర్వర్తించాలంటే ఇదంతా తప్పదు..''

''ఏదీ సెక్స్, వయొలెన్స్ రాయటమా?''

''అవును''

''ఎలక్ట్రానిక్ మీడియా నుంచి సాహిత్యాన్ని రక్షించుకో వటం అవసరమే. మరి పాశ్చాత్య దేశాలలో ముఖ్యంగా అమె రికా, బ్రిటన్, జర్మనీ దేశాల్లో టీవీ ఛానెల్స్ ఎంత ఉధృతంగా వున్నా రికార్డ్ స్థాయిలో పుస్తకాలు ఎందుకు అమ్ముడుబోతు న్నాయి?''

ఆయన సమాధానం చెప్పలేదు..ఏం చెబుతాడు?

''సినిమాలు, టీవీలు సాహిత్యం నుంచి ప్రజలను ఆకర్షిస్తు

**ఆదెళ్ళ శివకుమార్**

న్నాయి అంతవరకూ కరెక్టే. కానీ అద్భుతంగా వుండే కథనో, నవలనో ఎవ్వరూ కూడా ఉపేక్షించలేరు..ఎంత బిజీగా వున్నా కూడా ప్రజలు మంచి సాహిత్యం కోసం తపిస్తారు. ఆ స్థాయిలో రాయలేకపోవటం రచయితలుగా మన అసమర్థత. దాన్ని కప్పిబుచ్చుకునేందుకు చెత్త రాస్తూ ఆత్మవంచన ఎందుకు?''

కాంతికుమార్ ముఖం ఎర్రబడింది.

''నువ్వేమైనా కీట్సో, షేక్స్పియరో లేక కృష్ణశాస్త్రివో అనుకుంటున్నావా..!? నాతో పెట్టుకుంటే కనీసం నీ ఉత్తరం కూడా పత్రికల్లో రాకుండా త్రొక్కేస్తాను..'' ముఖం జేవురించి గొంతులో ద్వేషం జాలువారుతుండగా బెదిరించాడు.

''మంచిది..'' నేను పైకిలేస్తూ అన్నాను. ''కమిట్మెంట్తో రాయటం ఒక్కటే ఎవరైనా రచయితగా ఎదగటానికి తోడ్పడుతుందని నేను నమ్ముతాను సరే..త్రొక్కేయాలని మీరు కోరుకుంటే నేను ఏం చెప్పగలను..ఆల్ ది బెస్ట్'' అనేసి బైటకు వచ్చేసాను.

★ ★ ★

రచయితగా నాకున్న కమిట్మెంట్ నన్ను కాపాడింది.

డబ్బు, పాపులారిటీల కోసం సెక్స్ రాయకపోవడం వల్ల నా సక్సెస్ కొంత ఆలస్యమైనా అసలు రాకుండా ఎవ్వరూ ఆపలేకపోయారు. దీక్ష, టాలెంట్లతో పాఠకులతో 'పాజిటివ్ వేవ్ లెంగ్త్' ఏర్పరచుకున్న ఏ రచయితను అయినా ఎవ్వరూ ఏమీ చేయలేరు.

కాంతికుమార్ తన ప్రయత్నాలు విరమించలేదు.

నా గురించి విన్పించే కామెంట్స్కు రక్తం మరిగిపోయేది.

ఇంత దుర్మార్గంగా, శాడిస్టుగా మనుషులు ఎందుకు ప్రవర్తిస్తుంటారా అని నిరంతరం బాధపడేవాడిని.

సున్నిత మనస్కుడైన నేను ఆ కామెంట్స్కు నిద్రపట్టక నరకం అనుభవించేవాడిని.

'బాధపడటం అంటే బాధను అనుభవించేంత తీరికగా వుండటమే' అన్న వాక్యం నన్ను మేల్కొలిపింది.

నిరంతరం బిజీగా వుండటం అలవాటు చేసుకున్నాను. మరింత దీక్షతో రాయటం ప్రారంభించాను. రాత్రింబవళ్ళు నాకు సాహిత్యం తప్ప వేరే ఏది పట్టేది కాదు.

సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ నేను మంచి రచయితగా పాపులర్ అయ్యాను. పాపులర్ రచయిత కావటానికి, మంచి రచయితగా పాపులర్ కావటానికి చాలా తేడావుంది. అదృష్టవశాత్తూ పాఠకులు నన్ను ఆదరించారు.

ప్రభుత్వం కూడా...

నా నలభై అయిదవ ఏట నాకు 'సాహిత్య అకాడమీ' అవార్డు వచ్చింది.

అందరికన్నా ముందుగా వచ్చి నాకు కంగ్రాట్స్ చెప్పిన వ్యక్తి కాంతికుమార్.

నేను నవ్వుకున్నాను..

ఓ విధంగా నా విమర్శకులే నన్ను ఎదిగేలా చేసారు. నిరంతరం శ్రమించేందుకు కావాల్సిన స్ఫూర్తినిచ్చారు. నేను ఈరోజు ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని సంపదా, పేరు, ప్రతిష్టలు అన్నింటికంటే ముఖ్యం ఆత్మసంతృప్తితో బ్రతుకుతున్నాను. నా విమర్శకులే నా వ్యక్తిత్వాన్ని జ్వలింపజేసారు. నా విజయానికి కారణమయ్యారు. వారు నాకు చేసిన మేలుకు నేను సదా శిరసు వంచి నమస్కరిస్తాను.

''సార్''

నేను గతంలోంచి వర్తమానంలోకి వచ్చాను. కాంతికుమార్ సాహిత్యమే ఆయన కూతురు లేచిపోయేలా చేసిందని ఆయనతో నేను చెప్పదల్చుకోలేదు. ఎందుకంటే ఆయన రచనలలో అమ్మాయిలంతా టీనేజ్ నుంచే సెక్స్ కోసం తపిస్తుంటారు. తల్లిదండ్రుల దగ్గరే వాటి గురించి నిస్సంకోచంగా, ద్వంద్వార్థాల సంభాషణలు చేస్తుంటారు. అంతకుమించి తమకు పటిష్ఠంగా ఓ వాదన నిర్మించుకుంటారు. అమ్మాయిలు తమ స్వేచ్ఛని పోరాడి అయినా సాధించుకోవాలని రాస్తాడు. మరి ఇవన్నీ చదివిన ఆ తండ్రి కూతురు అలా ప్రవర్తించడంలో ఆశ్చర్యం ఏముంది?

ఓరోజు నేను వెళ్ళేసరికి ఆ తండ్రీకూతుళ్ళు గొడవ పడుతున్నారు. క్రితంరోజు రాత్రి ఆ అమ్మాయి రాత్రి పదకొండు దాటాక ఇంటికి వచ్చిందట. అదే నిలదీస్తున్నాడు కాంతికుమార్. ఆడపిల్ల ఆలస్యంగా రావటం, అబ్బాయిలు చేసే ఫోన్, కాలేజి ఎగొట్టి సినిమాలకు తిరగడాల గురించి ఎక్స్ప్లనేషన్ అడుగుతున్నాడు.

అందుకు ఆ అమ్మాయి నదురు బెదురూ లేకుండా ''చూడండి డాడీ! మీ రచనలలో ఓ అమ్మాయి రాత్రి పదకొండింటికి ఇంటికి వెడితే దాన్ని స్వేచ్ఛ అని, ఆడపిల్లలు కూడా మగపిల్లల్లా ఆనందం అనుభవించవచ్చని, అన్నింటిలాగే సెక్స్ కూడా ఓ బయోలాజికల్ నీడ్ అని రాస్తారు. అదే నేను ఒక్కరోజు కాస్త ఆలస్యంగా వస్తే మీకది బరితెగింపుగా కనబడుతోంది. అబ్బాయిల ఫోన్స్ ఏంటని ఎక్స్ప్లనేషన్ అడుగుతున్నారు. మరి అభిమానులమంటూ ఫోన్ చేసే అమ్మాయిలతో మీరెందుకు అంతంతసేపు మాట్లాడతారు? మీరేం రాస్తున్నారో, ఈతరం అమ్మాయిలకు ఏ లక్షణాలుండాలని ఆశిస్తున్నారో నేను అలాగే పెరుగుతున్నాను. నన్ను విమర్శించే అర్హత మీకు లేదు'' అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆమె మాటలకు ఆయనేం జవాబు చెప్పగలడు?

మనం రాసినవి కేవలం అక్షరాలు కాదు. అవి మన మానస పుత్రికలు.

ప్రేమ, ఆప్యాయత, నైతిక విలువలతో వాటిని సృష్టించి గౌరవాన్ని ఆపాదిస్తే కన్నబిడ్డలు కూడా ఆవిధంగా పెరుగుతారు. లేదంటే మనం సృష్టించిన పాత్రలకు ఉదాహరణ మన ఇంట్లోనే పుట్టి, మన కళ్ళముందే పెరుగుతారు.

ఓదార్పుగా ఆయన భుజం మీద చేయి వేసాను. నా అభిమాని అయిన ఓ ఇన్స్పెక్టర్కి ఫోన్ చేసి కాంతికుమార్ కూతురు గురించి ఎంక్వయిరీ చేయమని కోరాను.

మౌనం ఎంత శక్తివంతమైన ఆయుధమో నాకు జీవితం నేర్పింది.

మేధావులు, పండితులు, జ్ఞానులు తమను విమర్శించిన వారి మీద నోరు చేసుకోక మౌనాన్ని ఎందుకు ఆశ్రయిస్తారో, అందులోని విజ్ఞత ఏమిటో నేను అనుభవ పూర్వకంగా నేర్చుకున్నాను.

మనస్సును గాయపర్చటమే విమర్శకుని లక్ష్యం. 'అదంతా దుష్ప్రచారం' అని మనం ఎలుగెత్తి చెప్పేకొలదీ విమర్శకు బలం చేకూరుతుంది. మౌనంగా వుండటం ఇంకా ఎదిగితే చిరునవ్వుతో స్వీకరించటం అనేది మన వ్యక్తిత్వానికి పదును పెడుతుంది. ప్రతి విమర్శలు చేయకపోవడం, చౌకబారు సంభాషణలలో పాల్గొకపోవడం మన గౌరవాన్ని నిశ్చయంగా పెంచుతాయి. ఆ విషయంలో మన విమర్శకులకు మనం ఋణపడి ఉండాలి. వాళ్ళ జీవితం కంటే వాళ్ళు మన గురించే ఎక్కువగా ఆలోచిస్తారు. వారి విమర్శల్లో నిజం ఉంటే మనను మనం సరిదిద్దుకోవడం అవాస్తవం అయితే నవ్వుకుని వదిలేయడం.

ఎదుటివాడి ప్రతిప్రేలాపన, విమర్శ మనల్ని మానసిక అశాంతికి గురిచేస్తోందంటే మన వ్యక్తిత్వంలోనే ఏదో లోపం ఉందన్నమాట. ఆ లోపానికి సున్నితమైన మనస్సు నాదిలాంటి సమర్థన మూర్ఖత్వం.

అహాన్ని, విమర్శలను ఎలా జయించాలో బుద్ధుడు ఆచరించి చూపాడు.

రెండు వేల ఆరువందల సంవత్సరాల క్రితం గౌతమ

బుద్ధుడు చెప్పిన సత్యం ఎంత శక్తివంతమైనదో అర్థం చేసుకోగలిగాను కాబట్టి ఈ ఆధునిక కాలంలో నేను సక్సెస్ కాగలిగాను.

ఒకప్పుడు అతడు తన శక్తియుక్తులన్నీ అమాయకమైన ఆడపిల్లలకు అక్రమ సంబంధాలు అంటగట్టి ఆనందించడంలో గడిపేసాడు.

అవి ఆయనకు ఆ కాలంలో ఎంతో ఆనందాన్నిచ్చి వుంటుంది. కాని ఇపుడు సమయం వచ్చింది. చర్య తాలూకు ప్రతి చర్య ఏమిటన్నది ఆయన కూతురు నేర్పింది.

ఆయన గూర్చి తెలిసిన వారెవ్వరైనా సరే ఆయనకు తగిన శాస్తి జరిగిందని సంతోషిస్తారు. లేదంటే అసహ్యించుకుంటారు. కానీ బుద్ధుడు చెప్పింది కానీ, నా జీవితంలో సక్సెస్నూ, ఆనందాన్నీ, సంతృప్తినీ, శాంతిని ఇచ్చింది కాని అది కాదు.

వాళ్ళను అసహ్యించుకోకండి..

పట్టించుకోకండి..జస్ట్..క్షమించి వదిలేయండి..దట్సాల్!

☆

